

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 29 జనవరి 2024



- వరుస చేరికలతో జోష్
- మొన్న ఎమ్మెల్సీ రామచంద్రయ్య.. నిన్న మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి
- ప్రతి చోటా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు
- జగన్ అడ్డాలో బలం పెంచుకుంటున్న సైకిల్

టీడీపీలో కదనోత్సాహం



(కడప-ఆంధ్రజ్యోతి): నిన్నటి దాకా జగన్ సొంత గడ్డలో తమకు తిరుగేలేదంటూ కొందరు వైసీపీ నేతలు విర్రవీగే వారు. ఈసారి కూడా క్లీన్‌స్వీప్ అంటూ చంకలు గుద్దుకునే వారు. మళ్లీ మాదే గవర్నమెంటు అంటూ చెప్పుకునేవారు. అయితే ఇప్పుడు పరిస్థితి తారుమారవుతోంది. మొన్నటి వరకూ బలంగా కనిపించిన వైసీపీ బలహీన పడుతుండగా, బలహీనంగా ఉన్న టీడీపీ బలపడుతూ వస్తోంది. ఈ సారి చంద్రబాబే సీఎం అనేది జనంలో నానుతోంది. పట్టణాల్లోనే కాదు పల్లెల్లో కూడా ఇదే మాట వినిపిస్తుందంటారు. అందు కేనేమో.. ఫ్యాను కింద ఉక్కబోత తట్టుకోలేక ఒక్కొక్కరు నెమ్మదిగా సైకిలెక్కుతున్నారు. తొలుత గ్రామస్థాయి, మండల స్థాయి నాయకులు టీడీపీలో చేరితే వైసీపీ లైట్ తీసుకునేది. అయితే ఆ చేరికలు చాపకింద నీరులా మారాయి. ఇప్పుడు ఏకంగా ముఖ్యులే సైకిలెక్కుతుండడంతో టీడీపీలో జోష్ నెలకొంది.

ఇటీవలే వైసీపీ నుంచి ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య చంద్రబాబు సమక్షంలో మళ్లీ టీడీపీలో చేరారు. ఆయన వైసీపీ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సీఆర్సీకి మంచి ఆర్థిక విశ్లేషకులుగా పేరుంది. ఇప్పుడు మాస్ లీడర్, కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి తిరిగి చంద్రబాబు సమక్షంలో చేరడంతో జిల్లా టీడీపీలో కదనోత్సాహం నెలకొంది. వీరశివారెడ్డి 1994, 2004 ఎన్నికల్లో కమలాపురం నుంచి టీడీపీ తరపున గెలుపొందగా, 2009లో కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో వైసీపీకి మద్దతు ప్రకటించారు. ఎమ్మెల్యే రవిరెడ్డి గెలుపులో వీరశివారెడ్డిది కీలక పాత్ర ఉందంటారు. బలమైన వర్గం ఉన్న వీరశివారెడ్డి తిరిగి టీడీపీలోకి రావడంతో కమలాపురం టీడీపీలో జోష్ వచ్చినట్లయింది.

వరుస చేరికలతో

గత ఏడాది టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర జిల్లాలో సాగింది. ఆ సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో ప్రతి చోటా వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు వచ్చి చేరారు. కమలాపురం నియోజకవర్గం నుంచి వల్లూరు మండలానికి చెందిన వైసీపీ నేత సుధాకర రెడ్డి ఇంకా పలువురు లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు.

ఇక బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరిట జిల్లాలోని అన్నిచోట్లా కార్యక్రమం సాగుతోంది. ప్రతి చోటా వైసీపీ నుంచి టీడీపీలోకి జంప్ అవుతున్నారు. సీఎం జగన్ సొంతూరు పులివెందుల నియోజకవర్గంలో నుంచి కూడా టీడీపీలో చేరుతూ వస్తుండడం గమనార్హం. మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి పులివెందుల, వేంపల్లె, చక్రాయపేట, సింహాద్రిపురం ఇలా పలుచోట్ల వైసీపీ నేతలను సైకిలెక్కించారు. వేంపల్లెలో మైనార్టీ నేత జబ్బార్ ఇంకా పలువురు వైసీపీ నుంచి టీడీపీ గూటికి చేరారు. ఇక కడపలో పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాస రెడ్డి, ఇన్‌చార్జి ఆర్.మాధవీరెడ్డిలు వైసీపీ నుంచి ముస్లిం మైనార్టీలను, బీసీ ఇతర వర్గాల జనాలను భారీ ఎత్తున టీడీపీలో చేర్చుకుంటున్నారు. చేర్పుల కార్యక్రమం చాపకింద నీరులా సాగుతోంది. ఇక కమలాపురంలో టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి చెన్నూరు, వీఎన్‌పల్లె, సీకేదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, కమలాపురం మండలాల నుంచి పెద్దఎత్తున టీడీపీలో చేర్చుకుంటున్నారు. మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, బి.మఠం నుంచి పుట్టా సుధాకర్‌యాదవ్, బద్వేలులో కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల, అట్లూరు, గోపవరం నుంచి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీశ్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి రోశన్నలు పార్టీలో చేర్చుకుంటున్నారు. జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పల్లెపల్లెకూ వెళుతూ జనాలతో సమావేశమై వైసీపీ శ్రేణులను ఆకట్టుకుంటున్నారు. ప్రొద్దుటూరులో కూడా చేరికలు సాగుతున్నాయి.

ఈసారి ఎలాగైనా గెలవాలి

సీఎం జగన్‌ను సొంత గడ్డలోనే నిలువరించాలని టీడీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. 2004కు ముందు ఉమ్మడి కడప జిల్లా టీడీపీకి కంచుకోటగా ఉండేది. అయితే 2004లో వైఎస్ సీఎం అయిన తరువాత ఉమ్మడి జిల్లాలో రాయచోటి, కమలాపురం నియోజకవర్గాలను టీడీపీ గెలుపొందగా, 2009లో ప్రొద్దుటూరు, 2014లో రాజంపేట స్థానం గెలుచుకుంది. 2019లో మాత్రం అన్ని స్థానాలు కోల్పోయింది. అయితే ఈసారి పూర్వ వైభవం దక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. భవిష్యత్తు గ్యారంటీ పేరిట టీడీపీ నేతలు గడప గడప తొక్కుతున్నారు. 2004 నుంచి బద్వేలు, జమ్మలమడుగు, కడప, కమలాపురం, 2009 నుంచి ప్రొద్దుటూరు అసెంబ్లీ స్థానాలను టీడీపీ గెలవలేదు. మైదుకూరులో 1999 నుంచి టీడీపీ గెలవలేదు. అయితే టీడీపీ ఈసారి ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఉంది. అందుకు తగ్గట్టుగానే వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరుతున్నారు. కడప కార్పొరేషన్‌లో దాదాపు సగం మంది కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు సైకిలెక్కేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. నోటిఫికేషన్ వచ్చే సమయానికి పలువురు ఎంపీపీలు, సర్పంచ్‌లు ఇంకా పెద్దఎత్తున చేరికలు ఉంటాయని చెబుతున్నారు. మొత్తానికైతే టీడీపీలో ఉత్సాహం నెలకొంది.

వైసీపీ చూపంతా..
షర్మిలపైనే



- సొంత గడ్డకు నేడు పీసీసీ చీఫ్ షర్మిల రాక
- ఉమ్మడి జిల్లా కార్యకర్తలతో సమావేశం
- సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం చేసే యత్నం
- కడపలో ఏం మాట్లాడుతుందా.. అన్న ఉత్కంఠ
- ఇప్పటికే జగన్‌పై షర్మిల అటాక్
- జనంలోకి బాణంలా దూసుకుపోతోందని వ్యాఖ్యలు

(కడప - ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముద్దుల తనయ, సీఎం జగన్‌మోహన్ రెడ్డి సోదరి వైఎస్ షర్మిల నేడు కడపకు రానున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తరువాత ఇడుపులపాయ వచ్చి తండ్రి దివంగత వైఎస్‌కు నివాళులర్పించి వెళ్లి విజయవాడలో బాధ్యతలు చేపట్టారు. ఇక జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం తొలిసారి కాంగ్రెస్ చీఫ్ హోదాలో కడపకు వస్తున్నారు. స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ సైన్యాన్ని సార్వత్రిక ఎన్నికలకు కార్యోన్ముఖులను చేసేందుకు షర్మిల ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశాన్ని రింగు రోడ్డులో ఉన్న జయరాజ్‌గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. షర్మిలతో పాటు కాంగ్రెస్ రాష్ట్ర అగ్రనేతలు పల్లంరాజు, రఘువీరారెడ్డి, రుద్రంరాజు తదితర ముఖ్య నేతలు హాజరు కానున్నారు.

సర్వత్రా చర్చనీయాంశంగా...

దివంగత వైఎస్ఆర్ జీవితమంతా.. ఆయన మరణించే వరకూ కాంగ్రెస్‌లోనే కొన సాగారు. రాహుల్‌ను ప్రధానిని చేయాలన్నది వైఎస్ కల. 2004-09 ఎన్నికల్లో వైఎస్ నేతృత్వంలో కాంగ్రెస్ వరుసగా రెండుసార్లు అధికారం చేపట్టింది. 2004-09 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు గెలుచుకుంది. అయితే ఆయన మరణానంతరం జగన్ వైసీపీని స్థాపించడంతో కాంగ్రెస్ శ్రేణులంతా జగన్ వెంట నడిచారు. అయితే ఇప్పుడు జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్ పీసీసీ చీఫ్ బాధ్యతలు చేపట్టడం గమనార్హం. ఒకే జిల్లా నుంచి ఒకే కుటుంబం నుంచి అన్నా చెల్లి వేర్వేరు పార్టీలకు అధ్యక్షులుగా ఉంటూ బద్ధ శత్రువులుగా మారడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

బాణంలా.. షర్మిల విమర్శలు

కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా పర్యటనకు షర్మిల శ్రీకారం చుట్టింది. జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు గుప్పిస్తోంది. అభివృద్ధి లేదంటూ తూర్పారబడుతోంది. జగన్‌తోనే వైఎస్ కుటుంబం విడిపోయిందని.. నేరుగా జగన్‌పైనే అటాక్ చేస్తూ జగన్ శిబిరాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఊహించని విధంగా షర్మిల ప్రతి జిల్లాలో అక్కడ సమస్యలు ఎత్తి చూపుతూ జగన్‌పై అటాక్ చేస్తోంది. వెళ్లిన ప్రతి జిల్లాలో షర్మిల చేస్తున్న విమర్శలు బాణంలా జనాల్లోకి దూసుకుపోతున్నాయి. అయితే వైసీపీ సోషల్ మీడియా షర్మిల వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా నీచంగా ట్రోల్ చేస్తున్నప్పటికీ డోంట్ కేర్ అంటూ ముందుకు సాగుతుంది.

ఆసక్తిగా చూస్తున్న వైసీపీ శ్రేణులు

సొంత గడ్డ కడపలో నిర్వహించే కార్యకర్తల సమావేశంలో జగన్‌పై ఎలాంటి అటాక్ చేస్తుందోనని వైసీపీ శ్రేణులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అభివృద్ధి విషయానికొస్తే రెండుసార్లు టెంకాయ కొట్టిన స్టీలు ఫ్యాక్టరీ ఊసే లేదు. అదిగో పరిశ్రమ ఇదిగో పరిశ్రమ అంటూ కొప్పర్తిలో లక్షల మందికి ఉద్యోగాలు అరచేతిలో త్రీడీ సినిమా చూపించారు తప్ప పరిశ్రమలు రాని పరిస్థితి. ఇక ఇరిగేషన్ ప్రాజెక్టులు అటకెక్కాయి. గ్రామాల్లో అభివృద్ధి లేదు. భూకబ్జాలు, ఇసుక గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పోరుమామిళ్ల, వేంపల్లె, కమలాపురం, సీకేదిన్నె ఇలా ఎక్కడ విలువైన భూములుంటే అక్కడ వైసీపీ నేతలు గద్దల్లా వాలి కోట్లాది రూపాయలు విలువ చేసే భూములు మింగేశారు. సెటిల్‌మెంట్లలో తేడా రావడంతో కడపలో శ్రీనివాసరెడ్డిని సొంత మనుషులే హత్య చేశారు. ఇక పులివెందుల కోటలో అభివృద్ధి మాటున అక్రమాలు సాగుతున్నాయని విమర్శ ఉంది.

జగన్ శిబిరంలో టెన్షన్.. టెన్షన్

ముఖ్యంగా దివంగత మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు గురించి షర్మిల ఎలాంటి వ్యాఖ్యలు చేస్తుందో అన్న టెన్షన్ జగన్ శిబిరంలో కనిపిస్తోందని చెప్పుకొస్తున్నారు. ఇప్పటికే టీడీపీ హూ కిల్డ్ బాబాయి అంటున్నారు. ఈ నేపథ్యంలో షర్మిల కడప గడ్డ నుంచి హూ కిల్డ్ బాబాయి జగనన్నా అంటే ఇదో సంచలనంగా మారుతుంది. సమావేశం కూడా వివేకానందరెడ్డికి చెందిన జయరాజ్‌గార్డెన్స్‌లోనే జరుగుతుండడం గమనార్హం. ఇక అనంతపురం పర్యటన ముగించుకుని షర్మిల కడపకు రానున్నారు. అలంఖాన్‌పల్లె నుంచి రింగురోడ్డు మీదుగా జయా గార్డెన్స్ వరకు సిటీ కాంగ్రెస్ నేతలు మోటరు బైకు ర్యాలీ నిర్వహించనున్నారు. మొత్తానికైతే షర్మిల కడప పర్యటన చాలా హైప్ క్రియేట్ చేస్తోంది.

ఇడుపులపాయలో షర్మిల బస

వేంపల్లె, జనవరి 28: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం రాత్రి ఇడుపులపాయలో బస చేశారు. అనంతపురం జిల్లాలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ముగించుకుని రోడ్డు మార్గం ద్వారా ప్రత్యేక బస్సులో రాత్రికి ఇడుపులపాయకు చేరుకున్నారు. రాత్రి ఇక్కడే బస చేసి సోమవారం ఉదయం కడపలో జరిగే కాంగ్రెస్ కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

నామకరణాల
స్పెషలిస్టు జగన్

- జగన్ పాలనలో సంక్షేమం మేడిపండు చందం
- తులసిరెడ్డి ఎద్దేవా

వేంపల్లె, జనవరి 28: జగన్‌పాలనలో రాష్ట్రంలో సంక్షేమం మేడిపండు చందంగా తయారైందని కాంగ్రెస్ రాష్ట్రమీడియా చైర్మన్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలోఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు సమర్థవంతంగా అమలు చేసిన పథకాలకే పేర్లు మార్చి ప్రచారం చేసుకుంటూ.. జగన్ నామకరణాల స్పెషలిస్టుగా మారారని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు ఇచ్చేది గోరంత అయితే.. ధరలు పెంచి ప్రజలనుంచి లాక్కున్నది కొండంత అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎనిమిదిసార్లు కరెంటు చార్జీలు, మూడుసార్లు ఆర్టీసీ చార్జీలు పెంచిందన్నారు. పెట్రోలు, డీజలు, నిత్యావసర సరుకుల ధరలు, మద్యం, ఇసుక, సిమెంటు ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. జగన్ తనను తాను అర్జునుడితో పోల్చుకోవడం హాస్యాస్పదమన్నారు. ఉత్తర కుమారునితో పోల్చుకొని ఉంటే సమంజసంగా ఉండేదన్నారు.

దోచుకున్న సొమ్మంతా కుమ్మరించినా..
జగన్‌కు ఓటమి తప్పదు

- మంగంపేట బెరైటీస్‌పై జగన్ కన్ను
- నిబంధనలకు పాతరేసి అమ్మకానికి ఒప్పందం
- రాజ్యసభ సభ్యుడు, బీజేపీ నేత సీఎం రమేశ్

కడప(మారుతీనగర్), జనవరి 28: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు మంచి చేయడం అటుంచి అందినకాడికి దోచుకోవడం... దాచుకోవడమే తప్ప మరో ఆలోచనే లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ ధ్వజమెత్తారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దోచుకున్న డబ్బంతా కుమ్మరించినా జగన్‌రెడ్డికి ఓటమి తప్పదన్నారు. కడపలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ భూములు, ఇసుక, మద్యం...మట్టి... కొండలు...గుట్టలు... వాగులు...వంకల్లో కొల్లగొట్టిన లక్షలాది కోట్లు.. చాలక ఏకంగా జిల్లా సంపదైన మంగంపేట బెరైటీస్‌పై జగన్‌రెడ్డి కన్నుపడిందన్నారు. నిబంధనలకు పాతరేసి మరీ ఏకంగా 5 సంవత్సరాలకు ఓ వ్యక్తికి బెరైటీస్‌ను అమ్మేందుకు వీలుగా ఒప్పందం కుదుర్చుకోవడం దారుణమన్నారు. దీనిపై కలిసివచ్చే అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించి ఉమ్మడిగా అఖిలపక్ష కమిటీ పేరుతో మంగంపేట బెరైటీస్ వద్ద త్వరలో దీక్ష చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఎంతసేపు డబ్బు...డబ్బు...డబ్బు... యావ తప్ప ప్రజల ఇబ్బందులను జగన్‌రెడ్డి ఏమాత్రం ఖాతరు చేయడం లేదన్నారు. ఏపీలో జరిగే అరాచకాలను త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచకాలపై పీసీసీ చీఫ్ షర్మిల ప్రశ్నలకు వైసీపీ నాయకులతో పాటు ఏకంగా జగన్‌రెడ్డి సైతం సమాధానం చెప్పలేక ఆమె వ్యక్తిత్వంపై విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేయలేక ఏకంగా ఎమ్మెల్యే, ఎంపీలు పారిపోయే దుస్థితి దాపురించిన సంగతి తెలిసిందే అన్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీలు అంటూ వల్లమాలిన నటన కనబరచి ప్రస్తుతం వారు ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో సిట్టింగ్‌లకు సీట్లివ్వకుండా జగన్‌రెడ్డి కొత్త నాటకాలకు తెరలేపారని ఎద్దేవా చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మోదీ హవా మరోసారి సాగుతుందని, ముచ్చటగా మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్రమోదీ ప్రధాని కావడం తథ్యమని జోష్యం చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు వీవీ చల పతి, మునగా సతీష్‌కుమార్, సుబ్బారెడ్డి, రంగప్రసాద్, కేబీ శ్రీనివాసులు, హరినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

మమ్మల్ని ఆపేదెవడ్రా...

- గ్రావెల్ తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత
- వందల వాహనాల్లో కడపకు తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- అక్రమార్కుల అడుగులకు మడుగులొత్తుతున్న అధికారులు

పెండ్లిమర్రి, జనవరి 28: ప్రకృతి వనరులను కొల్లగొట్టడంలో వైసీపీ బ్యాచ్‌ను మించిన వాళ్లు మరొకరు ఉండరు అంటారు. వాళ్లకు నిబంధనలు, పర్యావరణ అనుమతులు, వాల్టా లాంటి చట్టాలు ఏమీ పట్టవు. ఎందుకంటే మాదే అధికారం, మా మాటే శాసనం, మేము చెప్పిందే చట్టం అనుకుంటారు. అందుకే వైసీపీ నేతల అక్రమాలను అడ్డుకునే సాహసం అధికారులు చేయరంటారు. కళ్లముందే సహజ వనరులను కొల్లగొడుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారు. ఒక విధంగా చెప్పాలంటే కళ్లు ఉన్న కబోదుల్లా మారారనే విమర్శ మండలంలో ఉంది. దీంతో కొంతమంది వైసీపీ నేతలు పైసా పెట్టుబడి లేకుండానే ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను కొల్లగొట్టి లకారాలు సంపాదించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ కార్యాలయాలకు ఆదివారం సెలవు రోజు. కొంతమందికి ఆటవిడుపు రోజు. అయితే పెండ్లిమర్రిలో వైసీపీ బ్యాచ్ ఆదివారాన్ని ఆదాయవారంగా మార్చుకున్నారు. ఇక మమ్మల్ని ఆపేదెవడ్రా అంటూ ఎక్సకవేటర్లకు పనిపెట్టారు. అంతే గుట్టలను గుల్ల చేసి గ్రావెల్‌ను వందల టిప్పర్ల ద్వారా కడపకు తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకోవడం ఇపుడు పెండ్లిమర్రి మండలంలో చర్చనీయాంశంగా మారింది. మండల పరిధిలోని చిన్నదాసరిపల్లె సర్వే నెంబర్ 15, పగడాలపల్లె సర్వే నెంబర్ 174, చీమలపెంట, తుమ్మలూరు రెవెన్యూ గ్రామాలలో గ్రావెల్ గుట్టలు ఉన్నాయి. ప్రస్తుతం కడప చుట్టూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అధికం కావడం, కొప్పర్తి పారిశ్రామికవాడలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ఆ భూమిని గ్రావెల్‌తో నింపడం కోసం గ్రావెల్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ డిమాండే వైసీపీ నేతలకు ఆదాయ మార్గంగా మారింది. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా పగడాలపల్లె, చిన్నదాసరిపల్లె ప్రభుత్వానికి సంబంధించిన గుట్టల్లో ఎక్సకవేటర్ల ద్వారా గ్రావెల్ తవ్వి అక్రమంగా టిప్పర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ గ్రావెల్ అక్రమ రవాణా కూడా పెండ్లిమర్రిలోని తహసీల్దార్, పోలీస్ కార్యాలయం నుంచి వెళ్లాల్సిందే. ఎప్పుడైనా అధికారులు అలా వచ్చి వాహనాలను పట్టుకుని వదిలేయడం జరుగుతోంది. ఈ విషయమై రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. వారు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ గ్రావెల్ అక్రమ సరఫరా మాకు సంబంధం లేదని చెప్పుకుంటున్నారు. దీనిపై ఇటీవల టీడీపీ నేతలు రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు లేవు.



చిన్నదాసరిపల్లెలో ఎక్సకవేటర్‌తో గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం



రోడ్డుపై అక్రమ గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్

గ్రావెల్ క్వారీలకు ఎక్కడా అనుమతి లేదు

మండలంలో అధికారికంగా గ్రావెల్ క్వారీలకు ప్రభుత్వం నుంచి ఎక్కడా అనుమతులు లేవని మండల తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డిలు తెలిపారు. అక్రమ తవ్వకాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఒక్క ఛాన్స్‌తో.. రాష్ట్రాభివృద్ధి 30 ఏళ్లు వెనక్కి

- దోచుకో..దాచుకో అన్నదే వైసీపీ నినాదం
- మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), జనవరి 28: ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేసి అధికారం చేజిక్కించుకున్న జగన్‌రెడ్డి తన అధ్వాన్న పాలనతో రాష్ట్రాభివృద్ధిని 30 ఏళ్లు వెనక్కి నెట్టాడని మాజీ ఎమ్మెల్యే జి.వీరశివారెడ్డి దుయ్యబట్టారు. దోచుకో..దాచుకో అన్నదే వైసీపీ నినాదమన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. ఆదివారం కడప నగరం ద్వారకానగర్‌లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయాల మేరకు పనిచేస్తూ రానున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అన్ని విధాలగా తోడ్పాటునందిస్తానని చెప్పారు. జేబ్రాండ్ మద్యం తో రాష్ట్ర ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతో మంది సీఎంలను చూశామని.. చెన్నారెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్‌లు చక్కటి పరిపాలన చేశారన్నారు. వైఎస్ఆర్ క్వాలిటీ ఒక్కటి కూడా జగన్‌మోహన్‌రెడ్డికి రాలేదన్నారు. వైఎస్‌కు ఎలా పుట్టాడురా అన్న సందిగ్ధం వస్తుందన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని ఆరోపించారు. పీసీసీ ప్రెసిడెంట్ షర్మిల దెబ్బకు తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌రెడ్డి చలికి లపడ్డారన్నారు. షర్మిల జగన్‌ను సర్వనాశనం చేసేందుకు కలకత్తా కాళీగా అవతరించిందన్నారు. అనంతరం వాసు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి చేరికతో జిల్లాలో టీడీపీకి బలం వచ్చినట్లయిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, సింగం సుధాకర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషాతో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, చిత్రంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



వదలని ప్లాస్టిక్ భూతం

ప్లాస్టిక్ ముప్పు వెంటాడుతోంది. ప్లాస్టిక్ వినియోగం మనుషులనే కాదు పర్యావరణాన్ని దెబ్బతీస్తుందని చెప్పవచ్చు. అధికారులు ప్లాస్టిక్ నిషేధించామని ప్రకటించుకోవడమే తప్ప ఆచరణలో మాత్రం శూన్యమే. ఫలితంగా ఏ వీధిలో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ఆకలిగా ఉన్న మూగజీవాలు కవర్లలో తినుబండారాల కోసం వెళ్లి ప్లాస్టిక్ కవర్లను సైతం తింటున్నాయి. అవి అరగక, బయటికి వచ్చే విధానం లేక పశువులు చనిపోతున్నాయి.ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ ముప్పు రోజురోజుకూ ఎక్కువవుతోంది. కడప నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లోనూ నిషేధం ఉన్నా ప్లాస్టిక్ వినియోగం మాత్రం తగ్గడం లేదు. చాలా దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా అమ్ముతున్నారు.







బద్వేలులో రోడ్డుపక్కన పడిఉన్న ప్లాస్టిక్ కవర్లు

బద్వేలు టౌన్, జనవరి 28: పొద్దున్నే టిఫిన్ మొదలు మాంసం, కూరగాయలు, చేపలు, ఇతర ఏ వస్తువులు కొన్నా ప్లాస్టిక్ కవర్లలోనే తీసుకెళుతున్నాం. ప్లాస్టిక్‌తో ముప్పు ఉందని తెలిసినా ప్రజలు కవర్ల వినియోగం మానుకోలేకున్నారు. వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు చాలామంది మురుగు కాల్వల్లో వేస్తున్నారు. దీంతో కాల్వల్లో మురుగునీరు నిలిచిపోయి దోమలు అభివృద్ధి చెంది పలు రకాల జబ్బులు వ్యాప్తి చెందుతున్నాయి. ప్లాస్టిక్ వస్తువులు చెరువుల్లో వేయడం వల్ల జలచరాలకు నష్టం వాటిల్లుతోంది. ఈ నీటి ద్వారా పండిన పంటలు సైతం అనారోగ్యం చేకూరుస్తున్నాయి. అయినా చౌకగా సౌకర్యవంతంగా ఉంటాయని ఇంటినిండా ప్లాస్టిక్ వస్తువులతో నింపడం, వాటి వాడకం వల్ల కలిగే అనర్థాలు అన్నీ ఇన్నీ కావంటున్నారు శాస్త్రవేత్తలు. ప్లాస్టిక్‌లో అత్యంత విష పూరిత రసాయనాలు ఉంటున్నాయని దానిని పీల్చడం ద్వారా క్యాన్సర్‌కు దారి తీస్తుంని అంటున్నారు. ప్లాస్టిక్ కాల్చినప్పుడు వెలువడే వాయువులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీని వల్ల గర్భస్థ శిశువులకు సైతం క్యాన్సర్ సోకుతుంది. రోగ నిరోధక వ్యవస్థ విచ్ఛిన్నమవుతుంది. నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని డాక్టర్లు చెబుతున్నారు.


నిబంధనలకు నీళ్లు

ప్లాస్టిక్ కవర్లు 50 మైక్రాన్ లోపు ఉండేవి వాడకూడదు. వీటిని రీ సైక్లింగ్ చేయడం సాధ్యం కాదు. కానీ చాలామంది వ్యాపారులు వీటినే విక్రయిస్తున్నారు. 50 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం ఉన్నవి తయారు చేయాలన్నా, కొనుగోలు చేయాలన్నా ఎక్కువ ధర అవుతుందని వ్యాపారులు వీటిని వినియోగించడం లేదు. దీనికి తోడు అధికారులు దుకాణాలపై నామమాత్రంగా దాడులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్లాస్టిక్ వాడకంతో అనారోగ్యం

ప్లాస్టిక్ వాడకంతో కాలుష్యం పెరిగి మానవులతో పాటు మొక్కలు, జంతువుల్లోకి విష పదార్థాలు చేరుతున్నాయి. నేలలో చేరిన ప్లాస్టిక్ కవర్లు, భూగర్భజలాలు ఇంకనీయకుండా చేస్తాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు తిని పశువులు వ్యాధుల బారిన పడి మృతి చెందుతున్నాయి. వ్యర్థాలు చేరిన నీటిని పంటలకు వినియోగిస్తే వాటిలోని రసాయనాలు మొక్కలు, వాటి దిగుబడుల్లోకి చేరుతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను కాలిస్తే గాలిలోకి విష రసాయనాలు విడుదలవుతాయి. ఇవి ఆస్తమా, క్షయ, ఇతర శ్వాసకోశ వ్యాధులను కలిగిస్తాయి. చాలా పర్యాయాలు మిగిలిన ఆహార పదార్థాలను కవర్లలో కట్టి రోడ్లపై పడేస్తున్నారు. వీటిని మూగజీవాలు తిని రోగాల బారిన పడి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నాయి. ప్లాస్టిక్ బాటిల్స్ కవర్లు, లంచ్ బాక్సులు వాడకుండా జాగ్రత్తలు పాటిస్తే పర్యావరణాన్ని ప్లాస్టిక్ ముప్పు నుంచి కాపాడుకోవచ్చని ప్రజలు, పరిశోధకులు అంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటున్నాం..



పట్టణంలో ప్లాస్టిక్ సంచులు, కవర్లు వాడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అనేక సార్లు బద్వేలులోని అన్ని దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాం. శానిటరీ సిబ్బంది ద్వారా మున్సిల్ యంత్రాంగం షాపుల యజమానులతో సమావేశాలు నిర్వహించి హెచ్చరికలు జారీచేశాం. అయినా అక్కడక్కడా కొందరు ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నట్లు తెలిసింది. అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా ప్లాస్టిక్ వాడకుండా సహకరించినప్పుడే సత్ఫలితాలు సాధించవచ్చు.

- క్రిష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనరు, బద్వేలు

అండగా మేముంటాం

● కలిసి టీడీపీని గెలిపించుకుందాం ● ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్సీ పుత్తా



ప్రసాద్‌బాబును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య

చెన్నూరు, జనవరి 28 : తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవడంలో మీకందరికీ మేం అండగా ఉంటాం, అందరం కలిసి టీడీపీని గెలిపించుకుందామని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. జిల్లా బలిజ సంఘం నేత ఆకుల ప్రసాద్‌బాబుతో పాటు దాదాపు వంద కుటుంబాలకు పైగా టీడీపీలో చేరిన సందర్భంగా ఆదివారం చెన్నూరులో సమావేశం నిర్వహించారు. సమావేశానికి బలిజలతో పాటు మైనార్టీలు, రెడ్లు, ఎస్సీలతో పాటు పలు కుటుంబాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రయ్య మాట్లాడుతూ వైసీపీ నేతలకు అధికార దాహం, ఆదాయంపై విపరీత ఆశ పెరిగి రాష్ట్రాన్ని ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకుండా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. వేల ఎకరాలు తీసుకున్నా వారికి తృప్తి లేదని, చివరికి శ్మశానంలో శవాలు పాతిపెట్టే స్థలం కూడా లేకుండా కబ్జా చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పుత్తా నరసింహారెడ్డి అన్ని అర్హతలు ఉన్న నాయకుడని, చంద్రబాబునాయుడుకు సైతం పుత్తా అంటే ఎనలేని అభిమానమని, జిల్లాలో ఉన్న మంచి నేత కాబట్టి ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు వేసి పుత్తాను గెలిపించుకోవాలన్నారు. పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ కేసీ ఆయకట్టు కింద ఈ ఏడాది వేలాది ఎకరాలు పంటలు సాగు చేయక బీడుగా పెట్టుకున్నారంటే అది పాలకులు చేసిన తప్పిదాలే అన్నారు. గండికోటలో నీరు ఒక టీఎంసీ వదిలి ఉంటే 10 నుంచి 12 వేల ఎకరాలు సాగయ్యేవని, ఆ నీరు వదలకపోవడంతో పొలాలు బీడు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రాంత నేత ఆదాయం, కమీషన్ల కోసమే పని చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు ఏ రైతును కదిలించినా పాలకుల ఆదాయాలు తప్ప ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అందుకే మీకు అండగా మేముంటాం, కలిసికట్టుగా అందరం కలిసి టీడీపీని గెలిపించుకుందామని ఆయన కోరారు. ఈ సందర్భంగా జిల్లా బలిజ సంఘం నేత ఆకుల ప్రసాద్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా అన్ని కులాలు వర్గాల నేతలు టీడీపీ కండువాను కప్పుకున్నారు. రాబోవు ఎన్నికల్లో పుత్తా నరసింహారెడ్డి అఖండ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ రామచంద్రయ్య పుత్తాను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, బలిజ సంఘం నేతలు, మాజీ సర్పంచ్‌లు జింకా సుబ్బరాయు డు, సోమశిల శ్రీనివాసులు, జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, 1104 అధ్యక్షుడు రమణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, పట్టణ అధ్యక్షులు ఆకుల చలపతి, ఇందిరెడ్డి శివారెడ్డి, నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల నుంచి వచ్చిన నేతలు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం

బాధిత కుటుంబాలకు టీడీపీ నేతల ఆర్థికసాయం



బాధితుల కుటుంబాలను పరామర్శిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, ద్వారకనాథరెడ్డి

గాలివీడు, జనవరి 28: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రామాంజనేయులు, అలాగే గాయపడిన గణేశ్ కుటుంబాలను ఆదుకుంటామని టీడీపీ నాయకులు తెలిపారు. శనివారం పీలేరులో జరిగిన చంద్రబాబు సభకు వెళ్లి తిరిగి వస్తున్న సందర్భంలో మహల్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు మరణించగా గణేశ్ అనే వ్యక్తికి తీవ్రగాయాలైన విషయం తెలిసిందే. ఆదివారం రామాంజనేయులు మృతదేహం తన స్వగృహమైన గోరాన్‌చెరువు బీసీ కాలనీకి వచ్చింది. అక్కడికి వెళ్లిన రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిలు మృతదేహానికి నివాళులర్పించి అనంతరం వారి కుటుంబానికి రూ.లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గోరాన్‌చెరువు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రామాంజనేయులు, గణేశ్‌లు శనివారం పీలేరులో చంద్రబాబు సభకు వెళ్లి వస్తుండగా మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందడం, ఇంకొకరు తీవ్ర గాయాలపాలవ్వడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రామాంజనేయులు భౌతికకాయానికి నివాళులర్పించిన రామాంజనేయులు, గణేశ్ కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు.

దహన కార్యక్రమానికి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రూ.25 వేలు మృతుడి తల్లికి అందజేయగా ఇంకో లక్ష రూపాయలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ ఎన్నారై చెంచు వేణుగోపాల్‌రెడ్డి రూ.50 వేలు చొప్పున రెండు కుటుంబాలకు లక్ష రూపాయలు ఆర్థికసాయం అందివ్వనున్నట్లు తెలిపారు.

50 మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లు

కడప (క్రైం), జనవరి 28 : కడప నగరంలోని వినాయకనగర్ సర్కిల్‌లో జానీ హోటల్ సమీపంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న రూ.10 వేల విలువ గల 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కడప తాలుకా సీఐ పి.రాజ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప అగాడి స్ట్రీట్‌కు చెందిన ఆటోడ్రైవరు షేక్ ఖాదర్‌బాషా అనే వ్యక్తి అక్రమ మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రాగానే ఆదివారం దాడి చేసి ఎలాంటి అనుమతుల లేకుండా ఎక్కువ ధరకు మద్యం బాటిళ్లు అమ్ముతున్న నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అతడి వద్ద నుంచి 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ ఓబులేసు పాల్గొన్నారు. వారిని ఎస్పీ, డీఎస్పీలు అభినందించారని వారు తెలిపారు.

చిన్నచౌకు పరిధిలో... : చిన్నచౌకు పరిధిలో అక్రమంగా ఆదివారం మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 32 డీపీఎల్ క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐలు రవికుమార్, మహ్మద్‌రఫి తెలిపారు.

ఎమ్మెల్యే ఎదుటే వ్యక్తిపై దాడి

● హౌసింగ్ బిల్లు రాలేదంటూ ఎమ్మెల్యే దృష్టికి

● బూతులు మాట్లాడి చేయి చేసుకున్న వైసీపీ నాయకుడు

కడప, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేస్తానని, చెప్పి డబ్బులు కూడా తీసుకున్నారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేసిన ఓ లబ్ధిదారుడిని బూతులు తిడుతూ ఎమ్మెల్యే సమక్షంలో చేయి చేసుకున్న ఘటన ఆదివారం బ్రహ్మంగారిమఠం రేకలకుంటలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మితమైన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగా గ్రామానికి చెందిన ఒకరు పై విషయం తెలియచేస్తుండగా, ఉపమండలాధ్యక్షురాలు సుభాషిణి భర్త, వైసీపీ నాయకుడు రాజానాయుడు ఇక్కడేంటి.. నీ.. అంటూ బూతులు తిడుతూ అక్కడి నుంచి బయటకు తోసేసి కొట్టినట్లు తెలిసింది. ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకువస్తే ఇలాంటివి చేయడం సబబు కాదని పోనీలే అంటూ ఘర్షణ జరగకుండా పక్కకు తీసి సర్దుబాటు చేశారు. కాగా గ్రామంలో గడపగడపకు ప్రభుత్వం నిర్వహించాల్సిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కార్యక్రమం నిర్వహించకుండానే వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా.. వాళ్ళు అన్నదమ్ములు.. దాయాదులు. వాళ్ల మధ్య ఎన్నో ఉంటాయ్ ఏమైనా చేసుకుంటారు..తోపులాటను బూతద్దంలో చూపాల్సిన పనిలేదని వైసీపీ నాయకులు పేర్కొనడం గమనార్హం.

ఇసుక అక్రమ రవాణాతో పగిలిన వ్యవసాయ పైపులు

●రాత్రి సమయాల్లో ఇసుక తవ్వకాలు ● వెంబడించి పట్టుకొన్న గ్రామస్థులు



పైపులు పగలిపోవడంతో వృథాగా పోతున్న నీరు

నిమ్మనపల్లి, జనవరి 28: రాత్రి 12 గంటల సమయంలో ఒక ఎక్స్‌కవేటర్, ఏడు ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తుడడంతో గ్రామస్థులు వారిని వెంబడించి ఒక ట్రాక్టర్‌ను మాత్రమే పట్టుకోగా మిగిలిన వాహనాలు వెళ్లిపోయాయి. దీంతో ఆదివారం వ్యవసాయభూమి యజమాని సురేంద్రరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తవళం పంచాయతి చౌకిళ్లవారిపల్లికి చెందిన మనోహర్‌రెడ్డి కుమారుడు జగదీష్‌రెడ్డి అక్రమంగా ఇసుకను తరలించేందుకు ఒక ఎక్స్‌కవేటర్, 7 ట్రాక్టర్లతో నిమ్మనపల్లి పంచాయతిలోని ఒడ్డు వద్ద ఇసుకను తవ్వేందుకు వెళ్లారు. అయితే అప్పటికే 30 లోడ్ల ఇసుకను అక్రమంగా తరలించి తన ఇంటి వద్ద డంప్ చేసి పెట్టాడన్నారు. కాగా తన వ్యవసాయ పొలానికి వేసిన పైపులను ఎక్స్‌కవేటర్‌తో తొలగించడంతో పైపులు పగిలి నీరు మొత్తం వృథాగాపోతోందని తెలిపారు. విషయం తెలుసుకుని వెళ్లగా అప్పటికే ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు అక్కడ నుంచి పరారయ్యాయి. అయినప్పటికీ ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అయితే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న స్థలంలో ఇద్దరు గ్రామ సేవకులు కూడా ఉండటం గమనార్హం. గ్రామ సేవకుల ఫొటోలను కూడా తీసుకొన్నట్లు తెలిపారు. గ్రామ సేవకుల ప్రమేయంతోనే అక్రమ రవాణా జరుగుతుందని ఆరోపించాడు. కాగా ఇసుక అక్రమ రవాణా చేసిన జగదీష్‌రెడ్డితో పాటు ఎక్స్‌కవేటర్‌పై మిగిలిన ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పట్టుబడ్డ ట్రాక్టర్ ముష్టూరు పంచాయతీ వలసపల్లికి చెందిన నన్నేసాహెబ్‌దిగా గుర్తించారు. నన్నేసాహెబ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్‌బాబు తెలిపారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సీకేదిన్నె, జనవరి 28: చదరంగం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు జగతి స్కూల్ కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ఆదివారం కడప నగరం రామచంద్రాపురంలోని జగతి స్కూలులో నిర్వహించారు. ఇందులో వివిధ జిల్లాల నుంచి 198 మంది విద్యార్థులు పాల్గొనగా మొత్తం ఏడు రౌండ్లు నిర్వహించి అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశామన్నారు. మొదటి బహుమతి, మూడవ బహుమతి అనంతపురానికి చెందిన కుషాల్, వెంకటరమణ దక్కించుకోగా రెండవ బహుమతిని తిరుపతికి చెందిన వెలుగోటి యాతిన్ రెడ్డి దక్కించుకున్నారన్నారు. వీరికి రూ.లక్షతో పాటు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, నాగార్జున, ఫణికుమార్, సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు నేటి వరకు గడువు

పీలేరు, జనవరి 28: ఇంటర్ పరీక్షల కోసం తత్కాల్ స్కీమ్ కింద ఫీజులు చెల్లించేందుకు ప్రభుత్వం సోమవారం వరకు గడువు పొడిగించిందని జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘ అధ్యక్షుడు నాగసురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చిలో ఇంటర్ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు రూ.3 వేల అపరాధ రుసుముతో సోమవా రం ఫీజు చెల్లించవచ్చునని ఆయన తెలిపారు.

లీవుల్లో వివక్ష

● విలీనమైనా తగ్గని పైస్థాయి అధికారుల టార్చర్

● కౌన్సెలింగ్ పేరుతో ఆబ్సెంట్లు.. జీతాల్లో కోతలు

● తలపట్టుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులు



కడప (మారుతీనగర్), జనవరి 28: అది ఆర్టీసీ కడప డిపో... అక్కడ సుమారు నాలుగువందల మందికి పైగా డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వహిస్తుంటారు. వీరంతా ప్రయాణికుల సేవలో తరిస్తూ సంస్థ పురోగతే పరమావిధిగా విధులు నిర్వహిస్తుంటారు. డిపో పక్కనే గ్యారేజి ఉంది. అక్కడ వందమందికి పైగా మెకానిక్స్, శ్రామిక్స్ రాత్రి.. పగలూ అనే తేడా లేకుండా డ్యూటీలు నిర్వహిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేలా బస్సుల కండిషన్‌ను మెరుగుపరుస్తుంటారు. పైపెచ్చు డిపోను ఇతర డిపోలకంటే మిన్నగా లాభాలబాట పట్టించేందుకు శ్రమిస్తుంటారు. ఇంతగా శ్రమించే వీరికి లీవుల విషయంలో ఇబ్బందులు తప్పడం లేదు. కొందరికే లీవులు మంజూరు చేస్తూ మిగిలిన వారిపట్ల వివక్ష చూపుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిపోలో, గ్యారేజీలో పనిచేసే ఉద్యోగులను అజమాయిషీ చేసే పైస్థాయి ఉద్యోగులు (గ్యారేజిలో ఇన్‌చార్జ్ ఎంఎఫ్, ట్రాఫిక్ సెక్షన్‌లో సీఐ) కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్స్, శ్రామిక్స్‌కు లీవులు ఇచ్చే విషయంలో తీవ్ర పక్షపాతం చూపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వారికి నచ్చిన అసోసియేషన్ల ఉద్యోగులకు ఏకంగా రెండుమూడు రోజుల పాటు లీవులిస్తూ, మిగతా అసోసియేషన్ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉందంటూ ఒక్కరోజు మాత్రమే లీవు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. పై పెచ్చు బస్సుల ఫెయిల్యూర్స్ ఎక్కువగా ఉన్నాయంటూ కడప డిపో అధికారి, రీజియన్ స్థాయి అధికారులు సైతం వీరిని టార్చర్‌కు గురిచేస్తూ బదిలీ చేస్తామంటూ బెదిరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. మామూలుగా ఒక్కో బస్సు 15 సంవత్సరాలకు కాలపరిమితి అయిపోతుంది. కాగా అదే బస్సుకు పైపై మెరుగులద్ది రంగులు పూసినంత మాత్రాన కొత్త బస్సు కాదనే సంగతి డిపో స్థాయి అధికారులకు తెలియంది కాదు. ఇప్పటికే కాలం చెల్లిన బస్సులతోనే కొన్నిరూట్లలో పాత బస్సులను తిప్పుతున్నట్లు సమాచారం. అలాంటి కాలం చెల్లిన బస్సులనే గ్యారేజిలో రిపేర్లు చేయిస్తూ అక్కడి మెకానిక్స్, శ్రామిక్స్‌లపై తీవ్ర పనిభారం చేయిస్తున్నారనే విమర్శలున్నాయి.

ప్రశ్నించిన వారికి ఆబ్సెంట్

ఇదిలావుండగా ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిందికదా ఉద్యోగానికి ఎలాంటి ఢోకా లేదనే భరోసాతో అధికారుల వైఖరిని ఎండగట్టిన వారిని కౌన్సెలింగ్ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రెండు, మూడు రోజులపాటు అబ్సెంట్ వేసి నెలవారిగా వచ్చే వారి జీతాలలో కోతపడేలా చేస్తున్నట్లు సమాచారం. ఈ తంతు సంవత్సరకాలంగా ఇటు డిపోలోని ట్రాఫిక్ విభాగంలో.. అటు గ్యారేజిలో సాగుతోందనే విమర్శలున్నాయి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అయ్యాక కింది స్థాయి ఉద్యోగులపై టార్చర్ మాత్రం మరింత తారాస్థాయికి చేరిందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ వ్యవహారంపై కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వర్‌రావును వివరణ కోరగా.. ప్రతీ పండుగకే అడిగిన వారికి లీవులిస్తున్నాం అన్నారు. ఇందులో ఎలాంటి పక్షపాతం లేదన్నారు.

అవినీతికి కేరాఫ్ అడ్రస్ ఈపీఎఫ్ఓ కార్యాలయం

కడప (చిన్నచౌకు), జనవరి 28: కడప ఈపీఎఫ్ఓ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందనే చర్చ జరుగుతోంది. ఉద్యోగ భవిష్యనిధి అంటే ఒక సంస్థ. ఏదైనా ఒక సంస్థలో పనిచేసే ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసింది. దేశ వ్యాప్తంగా వివిధ సంస్థల ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఉద్యోగ భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ). ఈ సంస్థ కార్యాలయం రాయలసీమ మొత్తానికి కలిపి కడప జిల్లాలో ఉంది. దీంతో నిత్యం వివిధ ప్రాంతాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు తమకు రావాలసిన బెనిఫిట్‌కు సంబంధించిన సమాచారం కోసం ఇక్కడికి వస్తుంటారు. ఈ క్రమంలో వారికి ఇబ్బందులు తప్పడంలేదు. నిత్యం ఏదో ఒక రకంగా వారిని కొంత మంది అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఏదైనా పని కావాలంటే కాసులు ముట్టజెప్పాల్సిందే. ప్రతి పనికీ ఓ రేటు కట్టాల్సిందే. అదే పనికి కొందరు అధికారులు అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకుని మరీ రేట్లు ఫిక్స్ చేస్తున్నారంటే ఇక్కడ అవినీతి ఏ మేరకు రాజ్యమేలుతుందో ఇట్టే అర్థమవుతుంది. రిటైర్ ఉద్యోగులకు తమకు రావాలసిన బెనిఫిట్స్ కోసం కాళ్లు అరిగేలా తిరగాల్సిందేనని, డబ్బు ముట్టజెప్పందే పనులు కావనే ఆరోపణలున్నాయి. కొంత మంది ఉద్యోగులు



కడప ఈపీఎఫ్ఓ కార్యాలయం

అదే పనిగా అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకుని మరీ దోచుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి పనికి కూడా నెలల తరబడి తిరగాల్సి వస్తుందని, ఇటువంటి పరిస్థితి ఎక్కడా లేదని రిటైర్ ఉద్యో

● నరకయాతన చూస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

గులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అవినీతి ఉద్యోగులకు అడ్డుకట్ట వేసే వారే లేరా అంటూ ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ విషయంపై రీజనల్ పీఎఫ్ కమిషనర్ మనోజ్ శంకర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన నిరాకరించారు.

ఒకటిన్నర సంవత్సరం నుంచి తిరుగుతున్నా



ఆధార్, మొబైల్ పీఎఫ్ ఖాతాకు లింకు చేసేందుకు దాదాపు ఒకటిన్నర సంవత్సరం నుంచి తిరుగుతున్నా. అధికారులు పట్టించుకోవడంలేదు. వచ్చిన ప్రతి సారి ఏదో ఒక కారణం చెప్పి పంపించేస్తున్నారు. మా బాధను ఎవరికి చెప్పుకోవాలి. కుటుంబ అవసరాలు ఎలా తీరాలి.
- ఎ.రవి. రిటైర్డ్ ఉద్యోగి, నెల్లూరు జిల్లా

జైళ్లలో ఉన్న బాల నేరస్తులకు తగు న్యాయ సహాయం

● సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప(రూరల్) జనవరి 28: పాన్ ఇండియా ప్రచారం 2024లో బాగంగా జైళ్లలో ఉన్న బాలనేరస్తులను గుర్తించి వారికి తగు న్యాయసహాయం అందించాలని సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ సెక్రటరీ ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. కడప పురుషులు, మహిళల కేంద్రకాగారాలలో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జైళ్లలో పాన్ ఇండియా ప్రచారం 2024 ను చేపట్టి యువతను పునరుద్ధరించడం, జైళ్లలో ఉన్న బాలనేరస్తులను గుర్తించడం, వారికి న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లతో టీమ్‌లను ఏర్పాటుచేసి పురుషుల కేంద్రాగారం, మహిళా కేంద్ర కారాగారాల్లోలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రచార సమయంలో జైళ్లలో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి తగు న్యాయ సహాయం అందించడం ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైళ్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సులో పురుషుల, మహిళల కేంద్రకాగారాల సూపరింటెండెంట్‌లు ప్రకాష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

మూల మల్లికార్జునరెడ్డికి పురస్కారం


మూల మల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న లలిత కళా కళాభిరామ పించం సంస్థ కార్యదర్శి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 28 : ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డికి తెలుగునాటకం, నాటకరంగానికి చేస్తున్న కృషికి లలిత కళాభిరామ పించం (సాంస్కృతిక సేవా సంస్థ, ఏపీ, తెలంగాణ) ఆత్మీయ పురస్కారం అందించారు. ఆదివారం హైదరాబాదు రవీంద్రభారతిలో లలిత కళాభిరామ పించం నిర్వహించిన 19వ వార్షికోత్సవ సభలో ఈ పురస్కారాన్ని మల్లికార్జునరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి ప్రసిద్ధ శిల్పకారుడు కళారత్న జయన్న మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా తెలుగు నాటక రంగానికి ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం ఆయనకు జ్ఞాపికను అం దజేశారు. సత్కరించారు. కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి అధ్యక్షులు పద్మశ్రీ డాక్టర్ త్రిపురనేని హనుమాన్‌చౌదరి, కళ్లెపు సాగర్‌రావు, డాక్టర్ ఎక్కలూరి శ్రీరాములు, అన్నంరాజు ప్రభాకర్‌రావు, గొల్లపల్లె దంపతులు జయన్న, మంజుల పాల్గొన్నారు.

'అక్రమాలకు పాల్పడుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 28 : ఉమ్మడి కడప జిల్లాలో ప్రాక్టికల్స్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభమవుతన్న నేపథ్యంలో చాలా ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఇంటర్మీడియట్ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు గణేశ్, సందీప్, అన్నమయ్య, సంతోష్, సాయి, పవన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్‌లో నియోజక వర్గాల అధ్యక్షుల నియామకం


యూత్ కాంగ్రెస్ అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేస్తున్న బండి సుమంత్ కుమార్

కడప(కలెక్టరేట్), జనవరి 28: ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు అధ్యక్షులను నియమించామని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండిసుమంత్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జమ్మలమడుగుకు చెందిన గంధం సునీల్ కుమార్, మైదుకూరుకు కొత్తపల్లిమల్లి ఖార్జునల రెడ్డి, కమలాపురం అధ్యక్షుడిగా ఆది శివ ప్రసాద్‌లను నియమించి వారికి జి ల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బండి సుమంత్ కుమార్ నియమాక పత్రాన్ని అం దజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు, పెలివెందుల అధ్యక్షులు వంశీ యాదవ్, కొమ్మద్ది సాయి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గెట్ టు గెదర్ కార్యక్రమంలో కలుసుకున్న 77-78 బ్యాచ్ విద్యార్థులు

సింహాద్రిపురం. జనవరి 28: సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1977-78 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాల్లో గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 45 సంవత్సరాల తర్వాత కలుసుకున్న 80 మంది విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య కుశల ప్రశ్నలతో ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు వీరనారాయణరెడ్డి, మురారెడ్డి, లక్ష్మీరెడ్డి, చెంచిరెడ్డి, కృష్ణమూర్తి, సోమేశ్వరులను విద్యార్థులు శాలువ, పూల మాలలతో సన్మానించారు. ఈ బ్యాచ్ విద్యార్థులందరూ వృత్తి, ఉద్యోగాల్లో బాగా స్థిరపడినందుకు వారి ఉపాధ్యాయులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అప్పట్లో పాఠశాలలో జరిగిన విషయాలు, చిలిపి చేష్టలు జ్ఞప్తికి చేసుకుని నవ్వుకున్నారు. ఇంత మందిని ఒకేచోట కలిసేటట్లు చేసిన భూమనపల్లి శివశంకర్‌రెడ్డి, పాతపల్లి మారుతీ ప్రతాప్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డిలను పూర్వ విద్యార్థులు శాలువాతో సన్మానించి ప్రశంసించారు.అందరూ కలిసినందుకు గు ర్తుగా జ్ఞాపికను ప్రతి ఒక్కరికి అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విందు భోజనం వారందరూ కలిసి ఆరగించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కడప (క్రైం), జనవరి 28 : కడప నగరంలో ఆదివారం సాయంత్రం పోలీసులు పలు చోట్ల ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. చిన్నచౌకు పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐలు రవికుమార్, మహ్మద్ రఫీలు వాహనాల తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లే కుండా వాహనాలు నడిపే వారికి జరిమానాలు విధించారు.

'ముఖ్యమంత్రిని గద్దె దించుతాం'



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాయన్

కడప (మారుతీనగర్), జనవరి 28: పెన్షనర్ల వెతలు పట్టించుకోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దించుతామని ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్ స్పష్టం చేశారు.పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీన అందాల్సిన పెన్షన్ నెలలో 16, 20 తారీఖున అందేలా జగన్‌రెడ్డి సర్కార్ పాలన సాగిస్తోందన్నారు. ఆదివారం స్థానిక ఐఎంఏ హాలులో పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సుబ్బరాయన్‌తో పాటు సెక్రటరీ జనరల్ పెద్దన్నగౌడ్, ఉపాధ్యక్షుడు మునయ్య మాట్లాడారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సింహాద్రిపురం, జనవరి 28: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు. ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచార నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

టీడీపీ మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా పీరా సాహెబ్

వేంపల్లె, జనవరి 28: వేంపల్లె మండల మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా గరుగువీధికి చెందిన పీరాసాహెబ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ప్రతి ఒక్కరినీ కలుపుకుని సమష్టిగా పనిచేస్తామన్నారు.

సీఐ బాల మద్దిలేటికి ప్రశంసాపత్రం


కలెక్టర్‌చే ప్రశంసాపత్రం అందుకుంటున్న దృశ్యం

పులివెందుల టౌన్, జనవరి 28: పులివెందుల రూరల్ స్టేషన్ సీఐ బాలమద్దిలేటికి ప్రశంసాపత్రం లభించింది. ఆయన విశిష్ట సేవలను గుర్తించిన ప్రభుత్వం కడప నగరంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని బాలమద్దిలేటి అందుకున్నారు. ఈయనకు ఇప్పటి వరకు 15సార్లు ప్రశంసాపత్రం అందినట్లు ఆయన పేర్కొన్నారు. సీఐకి ప్రశంసాపత్రాన్ని అందజేయడంపట్ల పులివెదుల పోలీసు అధికారులు, పోలీసులు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీని గెలిపించండి.. ఆదుకుంటాం

● టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 28 : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కుమ్మర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటామని టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం వీడీఆర్ కాంగోట్ హాలులో కుమ్మర్ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కుమ్మర్లు టీడీపీలోకి అధిక సంఖ్యలో చేరారు. అనంతరం వాసు మాట్లాడుతూ కుమ్మర్లు టీడీపీలో చేరడం చాలా సంతోషమన్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సమస్యలుపరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రమణ, సుబ్బరాయుడు, లింగేశ్వర, వెంకట్, స్వామి, శ్రీనివాసులు, శ్రీను పాల్గొన్నారు.

29వ డివిజన్‌లో... కడప నగరం 29వ డివిజన్‌లో టీడీపీలోకి భారీగా స్థానికులు చేరారు. వారికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి కండువా వేసి పార్టీకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలన చూసి యువత విసిగిపోయి టీడీపీలో చేరడం సంతోషమన్నారు. అన్నింటిలో 20 శాతం కమిషన్ అంజద్‌బాషాకు ఇవ్వాల్సిందేననే ఆరోపణలున్నాయన్నారు.


టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

టీడీపీతోనే అవినీతిరహిత పాలన

టీడీపీతోనే అవినీతిరహిత పాలన సాధ్యమవుతుందని శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి అన్నారు. కడప నగరం 2వ డివిజన్ ఉక్కాయపల్లె, మాచుపల్లె రోడ్డు నుంచి బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు క్రిష్టారెడ్డి, సుదర్శన్, పార్వతి, సునీత, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు వైసీపీ చేసింది శూన్యం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి


దౌలతాపురంలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, జనవరి 28 : గిరిజన గ్రామాలకు వైసీపీ చేసింది శూన్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని బలసింగాయపల్లె పంచాయతీ పరిధిలోని బలసింగాయల్లె, కనుపర్తి, దౌలతాపురం, ఎస్టీకాలనీ, ఎస్టీరామాపురం కాలనీ, కైలాసగిరి కోనలలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో యువనేతలు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మీరెడ్డి, పుత్తా సాయి నరసింహారెడ్డి ఇంటింటా తిరుగుతూ వైసీపీ వైఫల్యాలను వివరించారు. అనంతరం పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ఏ ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూర్చలేదన్నారు. రాష్ట్రంలో రోజురోజుకూ అప్పులు పెరుగుతున్నాయే తప్ప అభివృద్ధి జాడ కనిపించడంలేదన్నారు. ముఖ్యంగా దౌలతాపురం, ఎస్టీ రామాపురం రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. దీంతో రాత్రివేళల్లో గిరిజనుల కష్టాలు వర్ణనాతీతమన్నారు. పైగా ఆ ప్రాం తంలో చదువుకుని కూలి పనులు చేసుకునే పలువురు తమ బిడ్డలకు స్కాలర్‌షిప్ రాలేదని తెలిపారన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరినా సక్రమంగా స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో చేతి నుంచి డబ్బు కట్టామని, చదువుకున్నా ఉపాధి లేక కూలి పనులకు పోతున్నారన్నారు. చౌక దుకాణాల్లో బియ్యం, చక్కర తప్ప ఇంకేమి ఇవ్వడం లేదన్నారు.గిరిజన కాలనీల్లో దాదాపు వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. బలసింగాయపల్లె నేతలు లేవాకు విజయ ప్రతాప్‌రెడ్డి, లేవాకు శివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కనుపర్తి టీడీపీ నేతలు రామ్మూర్తిరెడ్డి, ధర్మారెడ్డి, ఎల్.వెంకటసుబ్బారెడ్డి, రవీంద్రకుమార్‌రెడ్డి, సాయికుమయార్‌రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, మండల ఉపాధ్యక్షుడు కుంచెం రామక్రిష్టారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, యువజన శాఖ అధ్యక్షుడు సుదర్శనరెడ్డి, జిల్లా కార్యదర్శి పవన్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యను అయోమయంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం

చక్రాయపేట, జనవరి 28: కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విదానాన్ని తీసుకొచ్చి సెకండరీ విద్యను తుంగలో తొక్కి ఉన్నత విద్యను అయోమయంలోకి నెట్టి వేసిందని ఏఐఎస్ఏ అన్నమయ్య జిల్లా ప్రధానకార్యదర్శి తుమ్మ లవకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుపరచి దేశంలో ఉన్న విద్యావస్థను కాషాయమయం కాకుండా కాపాడడానికి ఫిబ్రవరి నెల 1వ తేదీన ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో మహార్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కరణ్‌కుమార్, ఏరియా అధ్యక్షుడు రెడ్డి మహేష్, నాని, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లవకుమార్

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి

పులివెందుల టౌన్, జనవరి 28: విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని, ఆయనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి అన్నారు. ఆదివారం పట్టణంలోని బంగారు కాలనీ, మంగళకాలనీ, రాజారెడ్డికాలనీలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రవేశపెట్టే పథకాలను వివరిస్తూ ఒక్కో కుటుంబానికి చేకూరే లబ్దిని వివరించారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వం మోపిన ధరలతో సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు హయాంలో అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్లలా భావించి పాలన చేశారన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు తెప్పించి పరిశ్రమలు ఏర్పాటు చేయించి ఎంతోమందికి ఉపాధి దక్కేల చేశారని గుర్తుచేశారు. అన్ని వర్గాల ప్రజలకు మేలుచేసేలా పథకాలు ప్రవేశపెట్టడమే కాకుండా అందరికీ ఆమోదయోగ్యమైన రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధిపరిచారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అమరావతిని పక్కనపెట్టినప్పటికీ ప్రజలంతా అమరావతికే మొగ్గుచూపుతున్నారన్నారు. మూడు రాజధానులంటూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. కావున టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధివైపు పరుగులు తీస్తుందని అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న బీటెక్ రవి

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 28 : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామలింగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో గత 30 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో ఎలాంటి పురోగతి లేదన్నారు. స్పాట్ బిల్లింగ్ చేసేవారికి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు.

బీజేపీ కడప పార్లమెంట్ కన్వీనర్‌గా బొమ్మన

కడప (మారుతీనగర్), జనవరి 28: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్లను ప్రకటించారు. ఆ మేరకు కడప బీజేపీ పార్లమెంట్ కన్వీనర్‌గా బొమ్మన సుబ్బరాయుడు ఎంపికయ్యారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి తీవ్రంగా శ్రమిస్తానని బొమ్మన సుబ్బరాయుడు వెల్లడించారు.

తన ఎంపికకు కారకులైన దగ్గుబాటి పురందేశ్వరికి, జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌కు, రాజ్యసభ సభ్యులు సి.ఎం.రమేష్‌కు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డికి, జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు వ్యక్తం చేశారు.

వైసీపీలో అంతర్గత పోరు..!

పోరుమామిళ్ల, జనవరి 28 : త్వరలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో వైసీపీలో అంతర్గత పోరు మొదలైంది. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి సొంత మండలంలోనే బంధువుల నుండే అసమ్మతి సెగ తగులుతోంది. కాశినాయన మండల వైసీపీ నాయకుడు విశ్వనాథరెడ్డి తనకు పార్టీలో సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ ఇప్పటికే తన ముఖ్య అనుచరులు, సన్నిహితులతో సంప్రదింపులు జరిపి బలప్రదర్శనకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. డీసీ గోవిందరెడ్డి సోదరుడైన సత్యనారాయణరెడ్డికి బామ్మర్ది అయిన విశ్వనాథరెడ్డి గతంలో కూడా సమావేశాలు ఏర్పాటు చేసి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇది ప్రస్తుతం తారస్థాయికి చేరుకుందని తెలుస్తోంది. ఇప్పటికే పంచాయతీల వారీగా పోరుమామిళ్ల మండలంలో విశ్వనాథరెడ్డి ఫామ్ హౌస్‌లో అభిప్రాయ సేకరణ చేసినట్లు సమాచారం. నేడు పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాలతో పాటు అతనికి ముఖ్యఅనుచరులు, శ్రేయోభిలాషులు, సన్నిహితులతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. పార్టీలో కొనసాగుతారా, ప్రత్యామ్నాయం చూసుకుంటారా అన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

అన్నవరంలో టీడీపీ కార్యాలయం ప్రారంభం



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్, లింగారెడ్డి, సురేశ్‌నాయుడు

చాపాడు, జనవరి 28: మండలంలోని అన్నవరం గ్రామంలో ఆదివారం రాత్రి మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, టీడీపీ నాయకుడు సీఎం సురేష్‌నాయుడు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డు, అదుపు లేని గ్రావెల్, మట్టి తరలింపు

● ప్రేక్షక పాత్రలో రెవెన్యూ అధికారులు



గండికోట దారిలో కొండలో నుంచి ట్రాక్టర్లలో తరలిపోతున్న మట్టి

జమ్మలమడుగు, జనవరి 28: జమ్మలమడుగులో కొండ ప్రాంతం నుంచి అక్రమంగా ఎర్రమట్టి గ్రావెల్ గూడాదేవి చెరువులో నుంచి మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. ఏకంగా రెవెన్యూ అధికారుల అండతోనే గండికోట దారిలో రోడ్డుకు ఇరువైపుల ఎర్రమట్టి గ్రావెల్ చెరువులో నుంచి మట్టి తరలిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 150 నుంచి 180 ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నారు. గండికోట రోడ్డులో రెండు ఎక్స్‌కవేటర్లు పెట్టి మట్టి తరలిస్తున్నా వీఆర్వోలు, అధికారులు కానీ పట్టించుకోకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఇక్కడి మట్టి జమ్మలమడుగు మండలంలోని పలు ప్రాంతాలకు తరలిపోతోంది. దీనిపై జమ్మలమడుగు తహసీల్దారు గురప్పను ఆదివారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తనకు తెలియదని, వీఆర్వోతో ఇప్పుడే మాట్లాడానని, అలాంటివేమి లేవని చెప్పినట్లు తహసీల్దారు తెలిపారు. అయినా తాను విచారించి ఎక్స్‌కవేటర్‌ను పట్టుకుని సీజ్ చేస్తామని, రేపటి నుంచి ఆ ప్రాంతంలో మట్టి తరలిస్తే జరిమానాలు వేస్తామని ఆయన తెలిపారు.

అమృతానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 28 : అమృతానగర్‌లో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న రిలే దీక్షలు ఆదివారం నాలుగో రోజుకు చేరాయి. సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు ఇళ్ల స్థలాలు పొందిన వారు హాజరు కావాలని కోరారు. రిలే దీక్షలలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, హసీనా, అంజి, రాములమ్మ, రఫి, పాతిమా, ముంతాజ్ పాల్గొన్నారు.

ఒకటిన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 28 : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఒకటో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, నాగిరెడ్డి, బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక



బద్వేలులో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారు, జమ్మలమడుగులో టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూపేశ్‌రెడ్డి

బద్వేలు టౌన్, జనవరి 28 : వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్యకాలనీకి చెందిన మాజీ జడ్పీటీసీ ఎద్దుల ప్రసాద్ ఆధ్వర్యంలో సుందరయ్యకాలనీ, మంగళకాలనీ, త్యాగరాజకాలనీ, శివానగర్‌లోని వైసీపీకి చెందిన 250 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌రెడ్డి, బొజ్జ రోశన్న ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎద్దుల ప్రసాద్, మున్నెల్లి సుధాకర్, ఎద్దుల ప్రతాప్, షేక్ నాయబ్‌రసూల్, బద్వేలు శివ, బాలయ్య, ఖాజావల్లి, శౌరి, రవి, బాషా, సుబ్బరాయుడు, ఎస్‌కే మస్తాన్, శ్రీను మరికొంత మంది టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, బిగ్ బాస్, జహంగీర్‌బాషా, టీవీఎస్ రవి, మిత్తికాయల రమణ, హసన్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో ఆదివారం భారీగా టీడీపీలోకి చేరికలు జరిగాయి. అందులో భాగంగా మోరగుడిలో రచ్చబండ వద్ద నుంచి కాపువీధి శివార్లలో పలువురి ఆహ్వానం మేరకు భూపేశ్‌రెడ్డి అక్కడకు పోయి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి చేర్చుకున్నారు. చేరిన వారిలో చౌడం జొల్లు నడిపి సుబ్బరాయుడు, మహరాజు, తిరుపతిరాజు, లింగరావు, పాండురంగడు, చౌడం జొల్లు పాండు, చంద్రశేఖర్, శివ, నరేంద్ర, తులసీదాసు, సురేష్‌బాబు, తిలక్, భాస్కర్, మహేష్, సుబ్బరాయుడు, ఈశ్వర్, అంజి, భార్గవ రాముడు, సుబ్బయ్య, కల్యాణ్, మోహన్‌కుమార్, కొండయ్య, రఘు, సురేంద్ర, లోకనాధ్, సుబ్బరాయుడు, బాలుగ్రం, పార్వతి, నరసింహులు, కోటయ్య, రమణ, కుమార్, నరేంద్ర, పల్లా బాబు, భాస్కర్, చైతన్యకుమార్, వెంకటేష్, భానుప్రకాష్, సురేంద్ర, మురళీతోపాటు 60 కుటుంబాలు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రెండో వార్డులో..: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో ఆదివారం రాత్రి పలువురు టీడీపీలో చేరారు. వారి ఆహ్వానం మేరకు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. షేక్ హర్షద్ ఆధ్వర్యంలో చేరిన వారిలో షేక్ గైబూషావలి, సుబ్బు, అల్లాబకష్, తానీషావలి, షేక్ మహబూబ్‌బాష, రమణ, అరవింద్, శ్రీనివాసులరెడ్డి, కిశోర్, భాస్కర్, రుషి, అమీర్, నరసింహ, రాజశేఖర్, ప్రసాద్, తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రొద్దుటూరు మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ జబివుల్లా, ముర్రా బాలపుల్లారెడ్డి, నవనీశ్వరరెడ్డి, జనసేన పార్టీ నేతలు డాక్టర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఇంటికి పోవడానికి సిద్ధంగా ఉండాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి



ప్రొద్దుటూరు టౌన్, జనవరి 28 : ఎన్నికలు తర్వాత సీఎం జగన్ ఇంటికి పోవడానికి సిద్ధంగా ఉండాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనపై అన్ని వర్గాల ప్రజలు రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికలు జరిగితే వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల కోసం టీడీపీ సర్వసన్నద్ధంగా ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు విజయవాడలో ఆందోళన చేస్తే వారిపై కేసులు పెట్టి వేధించారని, వైసీపీ ప్రభుత్వం పీఆర్సీలో మోసం చేయడం, హామీ మేరకు పాత పెన్షన్ విధానం అమలు చేయకపోవడం, ఉద్యోగుల పీఎఫ్‌ను ప్రభుత్వం వాడుకోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వంపై రగిలిపోతున్నారన్నారు. 2 నెలలుగా అంగన్‌వాడీలు, మున్సిపల్ వర్కర్లు, ఇతర ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వారు వైసీపీకి ఎందుకు ఓటేయాలని ప్రశ్నిస్తున్నారన్నారు. ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను, పంటల బీమా, డ్రిప్ ఇరిగేషన్, క్రాప్ ఇన్సూరెన్స్ అమలు చేయకుండా రైతులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. లక్షలలో రేషన్ కార్డులను రద్దు చేయడం, ఆరోగ్యశ్రీ అమలుకాకపోవడం,నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో పేద ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రూ.13 లక్షల కోట్లు అప్పు తెచ్చిన జగన్ రూ.2.50 లక్షల కోట్లే సంక్షేమానికి ఖర్చు చేశారని, మిగిలిన డబ్బును ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు గుర్రప్ప, సిద్ధయ్య, రాము నాయుడు, సుబ్బరాజు పాల్గొన్నారు.

రాయలసీమకు నీటి వాటాలో తీరని ద్రోహం

నీటి హక్కుల సాధన కోసం సీమ ప్రజాప్రతినిధులు గొంతువిప్పాలి - బొజ్జా దశరథరామిరెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 28 : రాయలసీమకు చరిత్ర పొడవునా నీటి వాటాల్లో తీరని ద్రోహాన్ని పాలక ప్రభుత్వాలన్నీ తలపెట్టాయని ఇప్పటికైనా నీటి హక్కుల సాధనకోసం రాయలసీమ ఎమ్మెల్యే ఎంపీలందరూ గొంతువిప్పాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరధరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రైతు సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక శారద జూనియర్ కాలేజీలో రాయలసీమ సమగ్రాభివృద్ధి రాజకీయ పార్టీల వైఖరి అనే అంశం పై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో తీసుకొచ్చిన చీకటి చట్టం రద్దుచేయకపోతే రాయలసీమ ఏడారి అవుతుందన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణంతోనే కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకురాగలమన్నారు.గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణంతో కేసీ కెనాల్ స్థిరీకరణ జరుగుతుందన్నారు. విభజన చట్టం ప్రకారం రాయలసీమకు కడప ఉక్కు ఫ్యాక్టరీతో పాటు వికేంద్రీకరణ భాగంగా రాజధాని లేదా హైకోర్టు ఇక్కడ ఏర్పాటు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు రాబోయే రోజుల్లో జరిగే నష్టం నివారించాలంటే ప్రజా ప్రతినిధులంతా మేలుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి అధ్యక్షుడు ఆవుల వెంకటనారాయణ, ఆర్పీపీ యూనియన్ నేతల సుబ్బారెడ్డి, ప్రగతి శీల కార్మిక సంఘం కన్వీనర్ నాగేంద్ర, రాయలసీమ సాగునీటి సమితి నాయకులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

బద్వేలు, జనవరి 28: ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు ఇళ్ల స్థలాలు కేటాయించి వారిని ఆదుకోవాలని సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ డిమాండ్ చేశారు . ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో విభిన్న ప్రతిభావంతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యకమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, ఏరియా కార్యవర్గ సభ్యుడు పీవీ.రమణ, వికలాంగుల సంఘం నాయకులు రఫి, బాష, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బద్దెన విగ్రహావిష్కరణ



బద్వేలు టౌన్, జనవరి 28 : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో సుమతీ శతకర్త బద్దెన విగ్రహాన్ని ఆదివారం డిప్యూటీ కలెక్టరు ధర్మచంద్రారెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్దెన కవి రాసిన గ్రంథాలు నేటి సమాజానికి ఒక నైతిక విలువలు పెంపొందించే దిశగా ఎంతగానో ఉన్నాయని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ అవగాహన కవి డాక్టరు నరాల రామారెడ్డి, జిల్లా వైద్యశాఖ అధికారి రాఘవరెడ్డి, జిల్లా సమగ్ర శిశు ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, రామమునిరెడ్డి, జీవీ సుబ్బారెడ్డి, బద్దెన కళాపీఠం అధ్యక్షుడు గంగసాని సాంబశివారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంభు ప్రసాద్, రాజయ్య, కత్తి బ్రహ్మయ్య, సుధాకర్‌రెడ్డి, చింతంరెడ్డి రామచంద్రరెడ్డి, నాగిరెడ్డి శంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుభాష్, నాగేశ్వర్‌రావు, రామయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లైమ్‌లను విడుదల చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 28 : భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లైంలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. సంఘం 5వ మహాసభలు ఆదివారం ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించారు. సుధా థియేటర్ వద్ద నుంచి ఆ పాఠశాల వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, మాజీ జిల్లా కార్యదర్శి రామయ్య, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డిప్యూటీ సెక్రటరీ బాదుల్లా, వెంకటశివ, మంజుల, మద్దిలేటి, చిన్న ఓబన్న పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

చాపాడు, జనవరి 28: మండలంలోని రైతులు ఆయా గ్రామ సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో మ్యాగీ కోరారు. రబీ సీజన్‌లో జొన్న పైరు సాగు చేసి ఈక్రాప్ చేయించుకున్నవారు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఇంకా 605 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం జొన్నలను కొనుగోలు చేసేందుకు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలన్నారు.

కేసు నమోదు

పోరుమామిళ్ల, జనవరి 28 : సయ్యద్ అలియాస్ సనా అనే హిజ్రాపై జరిగిన దాడి సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ నెల 25న వెంకటలక్ష్మి టపాసుల ప్రాంతం సమీపంలో హిజ్రాను కొందరు గాయపరిచారని, గాయపడ్డ హిజ్రాను చికిత్స నిమిత్తం కడపకు తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం అందించేందుకు తిరుపతికి తీసుకెళ్లారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దాడికి పాల్పడ్డ వారు ఎవరనే విషయంపై ఆరా తీస్తున్నామన్నారు.

భగవద్గీతపై ప్రచారం

పోరుమామిళ్ల, జనవరి 28 : పోరుమామిళ్ల మండలంలోని సుంకేసులపల్లె, దమ్మపల్లె గ్రామాల్లో గిద్దలూరు చెందిన ప్రబంధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షులు శివ, సుభాషిణి, సుజాత, వెంకటేశ్, లీలా, నారాయణ, భాగ్యం, రమణ, పుల్లమ్మ, ఖాదర్, శేఖర్‌లు ప్రచారం నిర్వహించారు. ఆదివారం వారు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. భగవద్గీతలోని 16, 17 శ్లోకాలుత్రైత సిద్ధాంతానికి ఆధారమని తెలిపారు.

న్యాయం కోసం వెళితే కాలయాపన చేస్తున్న రెవెన్యూ అధికారులు

పోరుమామిళ్ల, జనవరి 28 : తమ పొలం జాతీయ రోడ్డు విస్తరణలో కోల్పోయినప్పటికీ నష్టపరిహారం కోసం ఏడాది నుంచి బద్వేలు ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కాలయాపన చేస్తున్నారని పప్పిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ముత్తుముల మల్లికార్జునరెడ్డి, హుసేన్, రంతుబాషా అనే వారు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 1185/1లో ఎన్‌హెచ్ 167/బీ రోడ్డు విస్తరణలో రూములు కోల్పోయామని, ఆర్డీవో స్వయంగా ఆరు నెలల క్రితం ఎంక్వయిరీ చేసి వెళ్లినా ఇంత వరకు తమకు న్యాయం జరగలేదని వారు వాపోయారు. ఈ విషయమై తహసీల్దారు గంగయ్యను వివరణ కోరగా, ఈ విషయం హైకోర్టు పరిధిలో ఉందని, తీర్పు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ధ్యాన సాధనతో ప్రశాంత జీవనం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 28 : ప్రతి రోజు ధ్యానం సాధన చేయడం ద్వారా ప్రశాంత జీవనం గడపవచ్చునని ఓం మండలి శివశక్తి అవతార్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు దేవకీ మాతాజీ పేర్కొన్నారు. ఆదివారం తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో సంస్థ ఆధ్వర్యంలో శివభోళానాథుని సత్సంగం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓంమండలి సంస్థ జాతీయ నాయకురాళ్లు ద్వారకా బాయి, విజయబాయి, అంజనాదేవి, అవ్వారు సుబ్బరామయ్య, వెంకటరమణ, శివకుమారి, తిరుపతి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్తు గ్యారెంటీ



జమ్మలమడుగులో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పోరుమామిళ్ల, జనవరి 28 : చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని తెలుగు గంగ అతిథిగృహం వెళ్లే దారిలో బుడ్గజంగాలు నివశించే ప్రాంతంలో తెలుగుగంగ విశ్రాంతి భవనం వెనుక వైపు ఉన్న వీధుల్లో చేపట్టిన బాబు షూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు రామసుబ్బారావు, సీతా వెంకటసుబ్బయ్య, సెట్టెం ప్రతాప్, వెంకటేశ్వర్లు, కరీముల్లా, అన్వర్, గిరి, దానం, నెంబరువలి కుమారుడు మస్తాన్, డ్రైవరు ఎస్‌ఎంబాషా, సత్యరాజ్ పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని కొండూరు, ముత్తుకూరు గ్రామాల్లో భవిష్యత్తు గ్యారంటీ ఆదివారం కడప టీడీపీ పార్లమెంటరీ మహిళ అధ్యక్షురాలు పాలకొండ సుధా ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. మినీ మేనిఫెస్టో పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పి.మల్లికార్జునరెడ్డి మాజీ మండల అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, కొండూరు ఎంపీటీసీ బి.లక్ష్మీదేవి, మండల పరిశీలకుడు శివయ్యస్వామి, రామచంద్రారెడ్డి, ఎల్.నారాయణరెడ్డి, జయక్రిష్ణారెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, గురు ప్రసాద్, ఉప సర్పంచ్ రామక్రిష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, కె.చిన్నపరెడ్డి, బుర్రిరాజాచెన్నక్రిష్ణయ్య, బి.వెంకటసుబ్బయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మోరగుడి గ్రామంలో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విశ్వనాథరెడ్డి, జయుడు, శంకర్, శ్రీనివాసులు, రాజా, తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు..: మండల పరిధిలోని పెదుళ్లపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమం మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సొదరి సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, రాఘవరెడ్డి, పవన్, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్ల, అట్లూరు, బి కోడూరులో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు